క్లుప్తంగా

విజయదుర్గమ్మకు సారె సమర్పణ



మండవల్లి: మండవల్లిలో కొలువైన ఉన్న నాగ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శ్రీ విజయ దుర్గమ్మకు గురువారం మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. కైకలూరు భక్త సమాజంవారు శ్రీలలితా సహస్రనామ పారాయణం చేశారు. శనివారం అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించనున్నారు.

శాకంబరిగా దుర్గాపార్వతీదేవి



కోసూరు(మొవ్వ): కోసూరు గ్రామంలో శ్రీ దుర్గానాగేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రీ దుర్గాపార్వతీ దేవి.. శాకంబరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చి ఆకట్టుకున్నారు. దేవాలయ ట్రస్టీ గుత్తికొండ రమేష్ ఆధ్వర్యంలో ఆషాడ శుద్ధ ద్వాదశి పురస్కరించుకుని అర్చకులు గూడూరు కృష్ణ వివిధ కూరగాయలు, ఆకు కూరలు, పూలతో అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా జరిగిన లలిత, విష్ణు సహస్రనామ పారాయణ, పూజా కార్యక్రమాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత



కైకలూరు: ఇంటర్నేషనల్ ఓమౌజయా యునైటెడ్ యంగ్ స్టార్స్ అసోసియేషన్ (ఐఏయూవైఎస్ఏ) స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో కైకలూరులోని వెలమపేట మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఉచితంగా పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథి సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి ఆ సంస్థను అభినందించారు. సంస్థ అధ్యక్షుడు తిరుమల రిషి, సభ్యులు వంశీ, హుస్సేన్ బాషా, సలహాదారు సత్యనారాయణ, పంచాయతీ వార్డు సభ్యులు గాలిబ్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దానం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వృద్ధులకు పండ్ల పంపిణీ



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో స్థానిక కరుణాపీఠం వృద్ధాశ్రమంలో గురువారం పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఎం.శివరామకృష్ణ మాట్లాడుతూ ఏడేళ్లుగా తమ క్లబ్ కరుణాపీఠం, శాంతి వృద్ధాశ్రమాలను దత్తత తీసుకుని వారికి సేవలందిస్తున్నామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కరుణా పీఠానికి కూరగాయలు, పండ్లు, భోజన వసతి ఏర్పాటు చేశామని క్లబ్ ప్రాజెక్ట్ చైర్మన్ బొప్పన కుటుంబరావు కుమార్తె స్వరూప వితరణతో అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ కె. రామరాజు, వి. బ్రహ్మాజీ, ఎల్. చిట్టిబాబు, బొగ్గారపు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యాన గురువారం స్థానిక బేతవోలులోని శాంతి వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. సేవాసంఘం సభ్యులు జి. శ్రీకాంత్ – కల్యాణి దంపతుల వితరణతో కార్యక్రమం నిర్వహించినట్లు సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, కృష్ణప్రసాద్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వసంతవాడ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వరి నారుమళ్లలో జాగ్రత్తలు పాటించాలి



పామర్రు: కాల్వలకు నీరు వస్తుండటంతో వరిసాగు పనుల్లో రైతులు నిమగ్నమవుతున్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వరి నారుమళ్లను పోసుకుని వరి సాగుకు సిద్ధమవుతున్నారు. మండల వ్యవసాయాధికారి శివనాగరాణి మాట్లాడుతూ ఎకరానికి ఊడు సెంట్లలో నారుమడిని తయారు చేసుకోవాలన్నారు. నారుమడుల్లో కలుపు గమనిస్తే ప్రిటిలంక్లోర్ 60 గ్రాములను 5 సెంట్ల నారుమడికి ఐదు కేజీల ఇసుకలో కలిపి చల్లుకోవాలని దీన్ని విత్తిన 3 రోజుల లోపు చేయాలన్నారు. రైతులు అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

దోమా కుట్టకే..

- ఇళ్లపై దాడి చేస్తున్న కొల్లేరు దోమలు
- ఆవాసాలుగా డ్రెయిన్లు
- కదలని మురుగు



మలేరియా కారక దోమ



శీతనపల్లిలో దోమల మందు పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

కైకలూరు: దోమల బెడదతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. దోమా కుట్టకే అంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు విడవని వర్షాలు, ముందుకు కదలని మురుగు మరింత భయపెడుతోంది. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, బోధకాలు, మెదడువాపుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కలిగిస్తున్నారు. కొల్లేరు సరస్సు సమీప ప్రాంతాల్లోని కిక్కిస, జమ్ము పొదల్లో దోమలు వృద్ధి చెందుతాయి. దీంతో రాత్రి వేళల్లో సమీప గ్రామాలపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి.

అందుబాటులో 10 పీహెచ్‌సీ సెంటర్లు

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 10 పీహెచ్‌సీ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 110 గ్రామ పంచాయతీలకు అక్కడి సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు. కైకలూరు, మండవల్లి మండలాల్లో కొల్లేరు పరివాహకలంక గ్రామాలు ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే ఈ ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. లంక గ్రామాల్లో దోమకాటు కారణంగా పశువుల పాలదిగుబడి తగ్గిపోతుంది. దోమకాటుకు ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. కొల్లేరు ప్రాంతం చిత్తడి నేలలు కావడంతో దోమల వృద్ధి శాతం అధికంగా ఉంటుంది.

డేంజర్ డెంగీ..

ఈడిస్ ఈజిప్టే దోమ(టైగర్) దోమ కాటుతో డెంగీ వ్యాధి వస్తోంది. నల్లగా ఉండే ఈ దోమకు తెల్లని చారలు ఉంటాయి. పగటిపూట మాత్రమే కుట్టే ఇది మూత లేని నీటి ట్యాంకులు, పాత టైర్లలో నిల్వ ఉన్న నీరు, తారు రోడ్లు, సిమెంట్ మీద నిలవ ఉండే వర్షం నీరు, ఇళ్లలోని పూల కుండీలు, కూలర్లు, వాడకుండా వదిలేసిన పాత్రలు, కొబ్బరి చిప్పలు, చీకటిగా ఉండే మూలాలు, కర్టెన్లు వంటి వేలాడే వస్తువులు, ఉపయోగించని గొడుగులు, అలంకరణ సామగ్రి కింద ఉంటాయి. ఇది కుట్టిన వారం తర్వాత హఠాత్తుగా తీవ్రమైన జ్వరం వస్తుంది. కాళ్లు కదల్లేని పరిస్థితి ఉంటుంది. ఎముకలు కండరాల్లో నొప్పి, శరీరంపై పొక్కులు దద్దుర్లు వస్తాయి.

మాయదారి మలేరియా...

మలేరియా.. ప్లాస్మోడియమ్ పరాన్నజీవి ఆడ అనాఫిలస్ కల్సి ఫేసిస్ దోమ ద్వారా ఇది వ్యాపిస్తోంది. మురుగునీటి కాల్వలు, చెరువులు, కుంటలు, పంట కాల్వలు, పొలాల్లో ఎక్కువగా ఇవి వృద్ధి చెందుతాయి. ఇందులో ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం ఫాల్సిఫారమ్ అనేవి రెండు రకాలు, ప్లాస్మోడియం వైవాక్స్ అంత ప్రమాదకమైంది కాదు. రెండో రకంలో ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. వెంటనే చికిత్స చేయకుంటే కాలేయం, కిడ్నీలు రక్తకణాలను దెబ్బతీస్తుంది.

పందులను నియంత్రించాలి

నియోజకవర్గంలో పందుల సంచారాన్ని నిరోధించాల్సి అవసరం ఉంది. పందులను కుట్టిన దోమలు తిరిగి మనుషులను కుట్టడంతో మెదడువాపు వ్యాధి వస్తోంది. ఇది పిల్లలకు ప్రాణాంతకంగా మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక బోదకాలు(ఫైలేరియస్) ఫైలేరియా క్యూలెక్స్ క్వింకే ఫేసియేటస్ దోమ ద్వారా వస్తాయి. ఈ దోమలు మురుగు, బురద నీరు గుంతలు, సెప్టిక్ ట్యాంకుల వలన ఇవి వృద్ధి చెందుతాయి.

ఇవి పాటించండి

- ఇంటి ఆవరణలో నిల్వ నీరు, బురదకయ్య లేకుండా చూడాలి.
- అందరూ కాళ్లు, చేతులు కప్పి ఉండే దుస్తులు ధరించడం ఉత్తమం.
- నిల్వ నీటిని ఎప్పటికప్పుడు పారబోయాలి.
- ఇంటి కిటికీలకు దోమలు రాకుండా తెరలను వాడటం మంచిది.
- జ్వరం వస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.
- పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, తాగిపడేసిన డిస్పోజల్ గ్లాసులు లేకుండా శుభ్రం చేసుకోవాలి.
- ఆరుబయట విక్రయిస్తున్న వంటలను తినకూడదు.
- వారానుకోమారు డ్రైడేను పాటిస్తే దోమ లార్వా చనిపోతుంది.
- నీటి సంపులు, ట్యాంకులపై తప్పకుండా మూతలు పెట్టుకోవాలి.
- దోమ కాటు నుంచి రక్షణ పొందడానికి లిక్విడోమ తెరలు, శరీర లేహ్యాలు వాడవచ్చు.

వైద్యశాఖ అప్రమత్తం..



దోమ కాటుతో వచ్చే వ్యాధులను సమర్థంగా ఎదుర్కొడానికి వైద్యశాఖ అప్రమత్తంగా ఉంది. ఇప్పటికే స్టాప్ మలేరియా కార్యక్రమాన్ని ఆగస్టు 31 వరకు చేస్తున్నాం. జ్వరాలు వస్తే పరీక్షలు చేయడానికి గ్రామీణ వైద్య ఉపకేంద్రాల్లో రాపిడ్ కిట్లను అందుబాటులో ఉంచాం. ఎలిషా టెస్టులను సైతం చేయిస్తున్నాం. దోమ కాటు నుంచి రక్షణ పొందడానికి తెరలను ఉపయోగించండి.

– బి.శంకర్, పీహెచ్‌సీ డాక్టర్, కొల్లేటికోట

హెల్మెట్ ధరించడం తప్పనిసరి

జూనియర్ సివిల్ జడ్జి శివకిరణ్



కైకలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్, న్యాయవాదులు



ర్యాలీ ప్రారంభిస్తున్న న్యాయమూర్తి

కైకలూరు: వాహనచోదకులు హెల్మెట్ ధరించి ప్రమాదాల నుంచి రక్షణ పొందాలని కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివకిరణ్ చెప్పారు. మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించాలని గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నీ మీద నీ జీవితమే కాదు, మీ కుటుంబ సభ్యుల జీవితాలు కూడా ఆధారపడి ఉంటాయనే స్పృహను గ్రహించాలని చెప్పారు. తలకు గాయాలు కావడంతో అధిక మరణాలు సంభవిస్తున్నాయని తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వేంపాటి సాయి సత్యనారాయణ, రూరల్ ఎస్సై టి.రామకృష్ణ, న్యాయవాదులు బోడావుల ఇందిరా, అడ్డగర్ల రాంబాబు, పాములు, పి.పవన్ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: చిన్న ప్రమాదాల్లో కూడా ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉండటంతో ముందు జాగ్రత్త చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పి. గాయత్రి అన్నారు. గురువారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ గుడివాడ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక శ్రీ చైతన్య కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వేణుగోపాల్, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అజయ్‌కుమార్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

తోట్లవల్లూరు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే కుమార్‌రాజా శాఖల వారీగా సమీక్షించారు. కొంతమంది అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి కూడా రాకుంటే ఎలా అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గంలో కాలువలు, డ్రెయిన్లలో గుర్రపుడెక్క తొలగింపు పనులు రూ. 90 లక్షలతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోడ్ల అభివృద్ధికి రూ. 30 కోట్లతో అంచనాలు రూపొందించినట్లు కుమార్‌రాజా చెప్పారు. ఎమ్మెల్యే హోదాలో తొలిసారి మండల సమావేశానికి విచ్చేసిన కుమార్‌రాజాను ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ సత్యనారాయణ, తహసీల్దార్ కుసుమకుమారి, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వండి

మొవ్వ: సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులు పంపాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఎంపీడీవో చంద్రశేఖర్‌కు సూచించారు. గురువారం మొవ్వ మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షతన నిర్వహించారు. రోడ్ల సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, డ్రైన్‌లో మురుగునీటి పారుదలకు గుర్రపు డెక్క, తూటుకాడ అడ్డంకిగా మారాయని, దమ్ము చక్రాల వినియోగంతో రోడ్లు ప్రమాదకరంగా మారాయని, పలు సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధరాజు, తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది

ముదినేపల్లిరూరల్: బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని ఐసీడీసీ సూపర్‌వైజర్ ప్రసన్న అన్నారు. బొమ్మినంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో భేటీ బచావో – భేటీ పడావో కార్యక్రమంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల కారణంగా అనారోగ్య సమస్యలతో పాటు పుట్టబోయే శిశువులు అనేక ఇబ్బందులు పడతారన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఇందుకు ఎవ్వరూ ముందుకు రావద్దని పేర్కొన్నారు. బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి బంగారు భవిష్యత్తును పొందాలన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలపై వివక్ష చూపకూడదన్నారు. సర్పంచ్ దారం సుధ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్త అరుంధతి, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడరూరల్: అమృత స్కీం ఫేజ్–2లో ఏర్పాటు చేసిన పైపులైన్లతో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటానని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఏలూరు రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో పబ్లిక్ హెల్త్, వాటర్ వర్క్స్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. తొలుత పబ్లిక్ హెల్త్ డీఈ పాండురంగ కాంట్రాక్టు సంస్థ ప్రతినిధుల వివరాలను ఎమ్మెల్యే రాముకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి అమృత్ కుళాయిల్లో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో మున్సిపల్ పాతపంపుల చెరువు గండి పూడ్చివేత, రివిట్మెంట్ ఆధునీకరణ పనులు జరుగుతాయని వెల్లడించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఏఈ ప్రభాకర్, సిబ్బంది, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

గ్రామాల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీరామదుర్గాప్రసాద్

మండవల్లి: మండల స్థాయి అధికారులు గ్రామాల్లోని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము) అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం మండల సర్వసభ్య సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ శేఖర్‌బాబు మాట్లాడుతూ గృహ నిర్మాణాలు మంజూరైన లబ్ధిదారులు 2025 మార్చి 25 లోపు నిర్మాణాలు చేయాలని పేర్కొన్నారు. మండవల్లి, ఇంగిలిపాకలంక గ్రామాల్లో ఫిల్టర్‌బెడ్‌లు శుభ్రం చేయాలని సర్పంచ్‌లు కోరారు. ఎంపీడీఓ ఆర్.బేబి శ్రీలక్ష్మి, ఈఓపీఆర్డీ బి.ఆనందబాబు, జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, వైస్ ఎంపీపీ విష్ణు, ఏఓ షేక్‌జరీనా, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఇరిగేషన్ భూముల ఆక్రమణలపై చర్యలు

పామర్రు: పామర్రు డ్రెయిన్ చానల్ మురుగుకాల్వ గట్లపై ఆక్రమణలో ఉన్న ఇరిగేషన్ స్థలాలపై చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈఈ విన్నకోట నాగ వెంకట రామ్‌కుమార్ అన్నారు. స్థానిక చల్లపల్లి రోడ్డులో పామర్రు చానల్, నాగులేరు కాలువల గట్ల మధ్య ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చానల్ గట్లపై కొన్ని ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇరిగేషన్ శాఖ స్థలంలో కొందరు నిర్మాణాలను కట్టారన్నారు. దీనిపై భూ ఆక్రమణల చట్టం ప్రకారం విషయాన్ని స్థానిక రెవెన్యూ శాఖ అధికారులకు తెలియజేసిచర్యలు తీసుకోవాలని కోరతామని తెలిపారు. కార్యక్రమంలో లస్కర్లు పాల్గొన్నారు.

జోరుగా పేకాట!

మొవ్వ: మండలంలో కొద్ది రోజులుగా పేకాట జోరుగా సాగుతోంది. ప్రధానంగా మండల పరిధిలోని శివారు గ్రామాల్లో నిత్యం పేకాట జరుగుతున్నా అటువైపు కన్నెత్తి చూడకుండా పోలీసులపై అధికార పార్టీ వర్గీయులు ఒత్తిడి తెస్తున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. ప్రధానంగా కాజ గ్రామంలో సుమారు నెలన్నరకు పైగా రోజూ క్రమంగా కోసు ఆడుతున్నారని, జూదరులు పెద్ద ఎత్తున గ్రామ శివారుల్లోని దొంకల్లో, మోటారు సావిడిల్లో ఆడుతున్నారని తెలుస్తోంది. ఘంటసాల, గూడూరు, బందరు ప్రాంతాల నుంచి జూదరులు గ్రామంలో తిష్ట వేస్తున్నట్లు సమాచారం. దీనిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదానానికి లక్ష వితరణ

గుడ్లవల్లేరు: కౌతవరం శ్రీ షిర్డీ సాయి మందిరానికి ఎన్నారై గుత్తికొండ శ్రీనివాస్ రూ.లక్ష విరాళాన్ని అందించారు. ఈ విషయాన్ని మందిర అభివృద్ధి కమిటీ చైర్మన్ కానూరి బాలకృష్ణ మోహన్(బాలు) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దాత శ్రీనివాస్ ఇచ్చిన రూ.లక్ష విరాళాన్ని రాబోయే గురుపౌర్ణమికి సాయి సన్నిధిలో జరిగే అన్నదానానికి వినియోగించనున్నామని పేర్కొన్నారు.

విద్యుత్ వాడకంలో అప్రమత్తం

ముదినేపల్లి రూరల్: విడవకుండా కురుస్తున్న వర్షాల కారణంగా విద్యుత్ వాడకంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని కరెంట్ ఏఈ పేర్ని రవికుమార్ అన్నారు. ముదినేపల్లిలో గురువారం ఆయన మాట్లాడుతూ గృహవినియోగదారులు, రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. తడిసిన స్విచ్ బోర్డులు, వైర్లు ముట్టుకోవద్దని సూచించారు. ఆక్వా రైతులు మోటార్ల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గట్ల వెంట ఉండే వైర్లను ఎటువంటి పరిస్థితుల్లోనూ ముట్టుకోకూడదన్నారు. కరెంటు స్తంభాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొలాలు, చెరువుల్లో విద్యుత్ సరఫరా వైర్లు తెగిపడితే సంబంధిత సిబ్బందికి వెంటనే సమాచారం అందించాలని కోరారు.

విద్యార్థులకు బస్‌పాస్‌లు



మండవల్లి: లింగాల సర్పంచ్ బోయిడి ధనలక్ష్మి రాధిక సురేష్‌బాబు ఆర్థిక సాయంతో మండవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం 97 మంది విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ఎన్డీఏ నాయకులు చాపరాల దుర్గాప్రసాద్ వీటిని అందజేశారు. కార్యక్రమంలో గుడివాడ చిట్టిబాబు, ముళ్లపూడి సత్తిబాబు, గుడివాడ మురళి, జి.గణేష్, హెచ్‌ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు జలమయం





పామర్రు: రెండు రోజులుగా కురుస్తున్న వానలకు రోడ్లు జలమయంగా మారాయి. స్థానిక పామర్రు–గుడివాడ రహదారి నుంచి గఫార్ సెంటర్ మీదుగా ఉన్న శివాలయం బజారు, యలమర్రు రోడ్డు వరకు ఉన్న రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. వానలు కురుస్తుండటంతో వాటిలో నీళ్లు నిలుస్తున్నాయి. స్థానిక అరండల్‌పేట, కోటిరెడ్డి పేట, చల్లపల్లి రోడ్లలో డ్రెయినేజీలు సక్రమంగా లేకపోవడం, వర్షం నీరు దిగువకు ప్రవహించని కారణంగా రోడ్లపైనే నీరు నిలిచిపోతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రహదార్లలో ఉన్న గోతులను పూడ్చించాలని, డ్రెయినేజీల్లో పూడికతీత పనులు నిర్వహించాలని కోరుతున్నారు.

మండవల్లి: మండవల్లిలో కైకలూరు వీధి అని పిలవబడే రహదారిపై పడిన గోతుల్లో వర్షం నీరు నిలిచి వాహనచోదకులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. వాహనం గొయ్యి వద్దకు రాగానే సమీపంలో ఉన్నవారిపై వర్షం నీరు చిమ్ముతుండటంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డు బాగుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లయన్స్ సేవలను మరింత విస్తృతపర్చాలి



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ శ్రీశాంతి

పామర్రు: లయన్స్ క్లబ్ సేవలను మరింతగా విస్తృతపర్చి జిల్లాలోనే మొదటి స్థానంలో 'పామర్రు' క్లబ్ ఉండేలా కృషి చేయాలని ఆ క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ దామర్ల శ్రీశాంతి పేర్కొన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ సేవా భవన్‌లో పామర్రు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. శ్రీశాంతి మాట్లాడుతూ 45 ఏళ్లుగా పామర్రు లయన్స్ క్లబ్ ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలను నిర్విరామంగా అందిస్తోందన్నారు.

- నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా నవులూరి వీర వెంకయ్యబాబు, కార్యదర్శిగా ఎం. మధుసూధన రావు, కోశాధికారిగా గడ్డాడ విక్టర్ పాల్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రముఖ వైద్యులు ధర్మవీర్, రామదాసులకు నూతన సభ్యత్వం కల్పించారు. కరోనా సమయంలో పేదలకు వైద్య సేవలను అందించిన ఆశా వర్కర్లను సన్మానించారు. గ్రామానికి చెందిన ఐదుగురు చిరు వ్యాపారులకు గొడుగులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మల్టిపుల్ మాజీ గవర్నర్ మూల్పూరి ఉపేంద్ర, రీజియన్ చైర్మన్ ఉపద్రష్ట రాంబాబు, జిల్లా నాయకులు శ్రీనివాసరెడ్డి, స్థానిక సభ్యులు పాల్గొన్నారు.

ఈ పచ్చదనం ప్రమాదకరం!



మోపర్రు వద్ద డ్రెయిన్‌లో దట్టంగా కనిపిస్తున్న గుర్రపుడెక్క

పెదపారుపూడి(పెదపారుపూడి) మండలంలోని మోపర్రులో ఉన్న వన్నేరు డ్రెయిన్‌లో తూడు, గుర్రపుడెక్క దట్టంగా ఉండటంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వస్తున్న నీళ్లు పొలాల్లోకి వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వన్నేరు డ్రెయిన్ కింద మండలంలోని వింజరంపాడు, మోపర్రు తదితర గ్రామాల్లో రెండు వేల ఎకరాల పొలం ఉంది. కురుస్తున్న వర్షాలకు నీళ్లు డ్రెయిన్ అంచుల వరకు వచ్చాయని, ఏమాత్రం నీటి ప్రవాహం పెరిగినా పొలాలు నీట మునగడం ఖాయమని రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 200 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ఎక్కడ ముంపు బారిన పడతామోనని రైతులు గగ్గోలు పెడుతున్నారు. డ్రైనేజీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా అదిగో ఇదిగో అంటున్నారే గానీ సమస్య పరిష్కారం కావడం లేదని రైతు బోయిన శివయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో డ్రెయిన్‌లో తూడు, గుర్రపుడెక్క తొలగించాలని ఆందోళన చేసినా డ్రైనేజీ అధికారులు స్పందించలేదని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.